క్లుప్తంగా

సర్పంచ్‌పై టీడీపీ నాయకుడి దాడి

పెద్దారవీడు: పుచ్చకాయలపల్లిలో టీడీపీ నాయకుడు మద్యం తాగి బజారులో వైఎస్సార్ సీపీ నాయకులను శనివారం రాత్రి తిడుతున్నాడు. గ్రామంలో ఉన్న దివంగత నేత సీఎం డాక్టర్ రాజశేఖరరెడ్డి విగ్రహం వరకు తిట్టుకుంటూ వచ్చాడు. అదే సమయంలో టీడీపీ నాయకుడు పోతిరెడ్డి వీరారెడ్డి వద్దకు సర్పంచ్ వజ్రాల రామలక్ష్మమ్మ వచ్చి తమ పార్టీ నాయకులను ఎందుకు తిడుతున్నావని ప్రశ్నించింది. సర్పంచ్ రామలక్ష్మమ్మను టీడీపీ నాయకుడు పోతిరెడ్డి వీరారెడ్డి దుర్భాషలాడాడు. సర్పంచ్ తమ్ముడు, వైఎస్సార్ సీపీ నాయకుడు మారం రెడ్డి రామస్వామిరెడ్డి సంఘటన స్థలం వద్దకు వచ్చి విషయం తెలుసుకున్నాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఇద్దరి మధ్య కొట్లాట చోటుచేసుకుంది. సర్పంచ్ భయాందోళన చెంది బీపీ పెరిగి స్పృహ తప్పి అక్కడే పడిపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. వెంటనే సర్పంచ్‌ని మార్కాపురం జిల్లా ప్రభుత్వం వైద్యశాలకు తరలించారు.

ఎయిడ్స్ వ్యాధిపై కళాజాత


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాజాత

మార్కాపురం: ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు హ్యాండ్స్ ఆఫ్ కంఫాషన్ (హెచ్ఓసీ) సొసైటీ ఆధ్వర్యంలో శనివారం గడియార స్తంభం సెంటర్‌లో కళాజాత బృందాలు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎయిడ్స్ వ్యాధి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, కండోమ్ వాడకాన్ని వివరించారు. వ్యాధి సోకితే మందులు ఏఆర్‌టీ సెంటర్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎయిడ్స్ వ్యాధిపై కళాజాత నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌జీవో ప్రాజెక్టు డైరెక్టర్ టీ ఆనంద్ బెంజిమెన్, సీపీఎం కిరణ్, విజయకుమారి, ఆలియా భాను, విజయకుమారి, షభానా, రేణుక, కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మానసిక వికాసం


పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థి

మార్కాపురం: వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా శనివారం విద్యార్థులచే పుస్తక పఠనం, చదరంగం, స్పోకెన్ ఇంగ్లిషు కార్యక్రమాలు నిర్వహించినట్లు గ్రంథపాలకుడు జీవి శివారెడ్డి తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకూ వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్. చరణ్, ఎ. రాజేష్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిట్నెస్ లేని వాహనాల్లో ప్రయాణం ప్రమాదం


ఆటోలకు జరిమానా విధిస్తున్న అధికారులు

దర్శి (కురిచేడు): ఫిట్నెస్ లేని వాహనాల్లో ప్రయాణం చేయడం ప్రమాదకరమని ఎంవీఐ రవికుమార్ హెచ్చరించారు. ఆర్టీసీ అధికారులు భానుప్రకాష్, శంకర్‌రావుతో కలిసి శనివారం ఆయన దర్శి–పొదిలి, దర్శి–అద్దంకి రోడ్‌లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అక్రమంగా తిరుగుతున్న వాహనాలను తనిఖీ చేసి లైసెన్స్ లేని డ్రైవర్లపై, ఫిట్నెస్ లేని ఆటోలు, టాటా మ్యాజిక్‌లపై జరిమానా విధించారు. ఫిట్నెస్ లేని, లైసెన్సులు లేని డ్రైవర్ల వాహనాల్లో ప్రయాణం ప్రమాదకరమని, ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం చేయాలని అధికారులు ప్రయాణికులకు సూచించారు.

రోడ్డు నాణ్యతకు తిలోదకాలు


పోతంపల్లి అడ్డ రోడ్డు వద్ద తారు రోడ్డుపై గుంత


చట్లమిట్ల అడ్డ రోడ్డు సమీపంలో బ్రిడ్జి వద్ద లేచిన కంకర

పెద్దారవీడు: మండలంలో హనుమాన్‌జంక్షన్ కుంట నుంచి దోర్నాల వెళ్లే నూతన జాతీయ రహదారి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదు. అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న జాతీయ రహదారి పాడవుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండారెడ్డి కాలనీ నుంచి మద్దలకట్ట గ్రామం వరకు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించకపోవడంతో కంకర రాళ్లు లేచి గుంతలు పడుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి ఉండాల్సిన రహదారి రెండు నెలలకే కంకర లేచి గుంతమయమవుతోంది. చట్లమిట్ల అడ్డ రోడ్డు నుంచి మద్దలకట్ట గ్రామం వరకు రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. బ్రిడ్జిల వద్ద ఇరువైపులా తారు, కంకర లేచి గుంతలుబడ్డాయి. ఇంజినీరింగ్ శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తారురోడ్డు పనుల్లో నాణ్యత లోపం తీవ్రంగా కనిపిస్తోంది. నిత్యం ఈ రహదారిపై గుంటూరు, కర్నూల్, శ్రీశైలం, మాచర్ల, విజయవాడ, తదితర ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులు, పెద్ద లారీలు, టూరిస్ట్ బస్సులు, ఆటోలు, ట్రాలీ ఆటోలు, మోటార్ సైకిళ్లు, కార్లు, తదితర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. తారు తక్కువ, కంకర ఎక్కువ శాతం మిశ్రమం చేసి తూతూమంత్రంగా వేయడంతో తారు రోడ్డుపై గుంతలు పడుతున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఈ రహదారిపై గుంతలు ఉండటంతో రాత్రిపూట రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతల్లో పడి ప్రమాదానికి గురైనామని ద్విచక్ర వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ తారు రోడ్డుపై గుంతలు పూడ్చి ప్రమాదాలు నివారించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


రాజంపల్లి సమీపంలో కంకర లేచిన రోడ్డు

ఫార్మర్ ఐడీ ఉంటేనే అన్నదాత సుఖీభవ


రుద్రసముద్రంలో మ్యాపింగ్ చేస్తున్న ఏఓ

దొనకొండ: అన్నదాతలకు ఇవ్వబోయే సుఖీభవ పథకానికి రైతులందరికీ తప్పని సరిగా ఫార్మర్ ఐడీ ఉండాలని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం మండలంలోని రుద్రసముద్రం రైతు సేవా కేంద్రంలో రైతులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ఆధార్‌కార్డు, పొలం పాస్‌పుస్తకం, ఆధార్‌తో లింకైన ఫోన్ నంబర్ తీసుకుని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు. ప్రస్తుతం అన్నదాత సుఖీభవ పథకం కోసం గ్రామస్థాయిలో డేటా వాలిడేషన్ జరుగుతుందని, రైతులు ముందుగా పొలాన్ని వెబ్ ల్యాండ్‌లో ఆధార్‌తో లింక్ చేసుకోవాలని సూచించారు. అదే విధంగా కుటుంబ సర్వేలో ఆధార్ మ్యాపింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. రైతులకు 50 శాతం రాయితీపై మినుములు, జీలుగలు అందజేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని గ్రామాల్లోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో గ్రామ రైతులు, వ్యవసాయ సిబ్బంది నాసర్‌వలి పాల్గొన్నారు.

వేసవి తాపం నివారణకు మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీలో ఎంపీడీఓ శ్రీదేవి

దొనకొండ: స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర సంకల్పం కార్యక్రమంలో భాగంగా ప్రజలను వేసవి తాపం నుంచి రక్షించేందుకు ఎంపీడీఓ ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కుట్టుమిషన్ల శిక్షణ సందర్భంగా మహిళలకు పారిశుధ్య నివారణపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ కవర్ల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఈఓఆర్‌డీ షేక్ ఆదాం షఫీ, పంచాయతీ కార్యదర్శి పి.కృష్ణమూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తకు ఎమ్మెల్యే తాటిపర్తి నివాళి

త్రిపురాంతకం: మండలంలోని పాత ముడివేములలో అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త మగులూరి శ్రీనివాసులు భౌతిక కాయానికి ఆ పార్టీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


శ్రీనివాసులుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


మానవహారంగా ఏర్పడిన అధికారులు, సిబ్బంది

కురిచేడు: ప్రజలు ఎండకు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ సతీష్‌బాబు కోరారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో శనివారం స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అధికారులు, సిబ్బంది బస్టాండ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వేసవిలో జాగ్రత్తగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ కేసనపల్లి కృష్ణయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి, పంచాయతీ కార్యదర్శి చాంద్‌బీ, వీఆర్వో నాగరాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రసాభాసగా సర్వసభ్య సమావేశం


ఎంపీడీవోను నిలదీస్తున్న జెడ్పీటీసీ ఇందిర

- ప్రజాప్రతినిధులకు మర్యాద ఇవ్వడం లేదంటూ మండిపాటు

తర్లుపాడు: జవాబుదారితనంగా ఉండాల్సిన అధికారులు సమస్యలపై పట్టించుకోవడం లేదని ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ భూలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం తీవ్ర ఉద్రిక్తలకు కారణమైంది. తమను కాదని గ్రామాల్లో అధికార పార్టీకి చెందిన వ్యక్తులకు ప్రాధాన్యత ఇస్తూ తమ పట్ల పంచాయితీ, మండల స్థాయి అధికారులు అమర్యాదగా వ్యవహరిస్తున్నారంటూ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంబుక్ చేయకుండా నెలల పాటు ప్రజా ప్రతినిధులను కార్యాలయాల చుట్టూ తిప్పుకునే అధికారం మీకెవరిచ్చారో చెప్పాలంటూ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని పోతలపాడు సర్పంచ్ శ్రీనివాసరెడ్డి నిలదీశారు. ఎన్ఆర్ఈజీఎస్‌లో తీవ్ర అవినీతి జరుగుతుందని కేతగుడిపి సర్పంచ్ పెద్దమస్తాన్ ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ అధికార పార్టీ నాయకుల కోసం నీటి ట్యాంకులు వినియోగిస్తూ ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని చెన్నారెడ్డిపల్లి సర్పంచ్ కుందురు వెంకట సుబ్బులు సభ దృష్టికి తెచ్చారు. ఎస్సీ హాస్టల్ ఎదురుగా ఉన్న బజారులో పారిశుధ్యం అధ్వానంగా ఉందని కోఆప్షన్ సభ్యులు అక్బర్ అలీ సభ దృష్టికి తెచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధులమైన తమ పట్ల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని కేతగుడిపి సర్పంచ్‌పెద మస్తాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత రెండు నెలలుగా గ్రామంలో మూడు డీప్‌బోర్లు పనిచేయడం లేదని సీతానాగులవరం సర్పంచ్ ఆంజనేయులు సభ దృష్టికి తెచ్చారు. ఒక పక్క సర్వసభ్య సమావేశం రసాభాసగా జరుగుతుంటే తనకిదేమీ పట్టదన్నట్టు ఎంపీడీవో కునుకుతీయడం పలు విమర్శలకు తావిచ్చింది.

జెడ్పీటీసీ సభ్యురాలికి అవమానం

తనకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా సర్వసభ్య సమావేశం ముగించడంతో జెడ్పీటీసీ వెన్న ఇందిర హనుమారెడ్డి ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. జెడ్పీటిసి అయిన తనకే మాట్లాడే అవకాశం ఇవ్వకపోతే ప్రజల సమస్యలు ఏవిధంగా పరిష్కరిస్తారో అర్థమవుతుందని అన్నారు. జరిగిన అవమానంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని చెప్పి సభనుంచి వాకౌట్ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ కిశోర్‌కుమార్, ఏవో చంద్రశేఖర్, వివిధశాఖల అధికారులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పాల్గొన్నారు.

రాయితీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దారవీడు: మండలంలోని మైనార్టీలకు రాయితీ రుణాల కోసం ఈ నెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని ఎంపీడీఓ జాన్‌సుందరం శనివారం తెలిపారు. పెద్దారవీడు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, దేవరాజుగట్టు కెనరా బ్యాంకు పరిధిలో మొత్తం మూడు యూనిట్లు మంజూరుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. అర్హులైన మైనార్టీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దివ్యాంగులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలి


ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న మదార్‌వలి

పొదిలి రూరల్: అర్హులైన దివ్యాంగులకు బీసీ, ఎస్సీ, మైనారిటీ కార్పొరేషన్‌లకు సంబంధించిన సబ్సిడీ రుణాలు.. ప్రభుత్వ జీవో 43 ప్రకారం 5 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి అధ్యక్షుడు ముల్లా మదార్‌వలి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఈదర విజయలక్ష్మికి వినతిప్రత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ పొదిలి మండలంలో అర్హులైన దివ్యాంగులు బ్యాంకుల్లో రుణాలు పొందాలంటే చాలా కష్టంగా ఉందన్నారు. బ్యాంకుల్లో దివ్యాంగులు మీరు ఏవిధంగా రుణాలు చెల్లిస్తారని తమ ఆత్మ గౌరవాన్ని కించపరచే విధంగా మాట్లాడుతున్నారు. సచివాలయాల్లో దివ్యాంగులకు అనువుగా ర్యాంపులు, వీల్‌చైర్లు, ఏర్పాటు చేయాలని కోరారు.

ఉగ్రవాదులకు సరైన గుణపాఠం చెప్పాలి

గిద్దలూరు రూరల్: పహల్గామ్‌లో ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా చేసినందుకుగాను శనివారం బీజేపీ నాయకులు శనివారం పట్టణంలోని పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కిసాన్ మోర్చ కార్యవర్గ సభ్యుడు పిడతల రమేష్ రెడ్డి మాట్లాడుతూ పాకిస్తాన్‌లోని ఉగ్రవాదులను సమూలంగా నాశనం చేసేందుకు ప్రభుత్వం శక్తివంచన లేకుండా పనిచేస్తుందన్నారు. దేశంలోని ప్రజలందరూ కులమతాలకు అతీతంగా దేశరక్షణ వ్యవస్థకు పూర్తిగా మద్దతుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ నారాయణ, పంట శివమల్లారెడ్డి, దూదేకుల బాదుల్లా, కొప్పుల నరసింహులు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

గాలీవాన బీభత్సం


దర్శిలో కురిసిన చిన్నపాటి వర్షానికి ఇలా..

దర్శి (కురిచేడు): దర్శి మండలంలో శనివారం సాయంత్రం వచ్చిన అకాల వర్షం ప్రజలను, రైతులను భయబ్రాంతులకు గురిచేసింది. నియోజకవర్గంలోని కురిచేడు, దర్శి, ముండ్లమూరు మండలాల్లో ఉరుములు, మెరుపులు మెరిశాయి. విపరీతమైన గాలితో చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి. పందిళ్ల లేచిపోయాయి. రైతుల కల్లాల్లో ఉన్న పంటలు తడిసిపోయాయి. విద్యుత్ తీగలు ఎక్కడ తెగి పడతాయోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేశారు. పెనుగాలలతో బీభత్సం సృష్టించిన వాతావరణంలో చివరకు చిన్నపాటి వర్షంతో సరిపెట్టింది. ఆ సమయంలో ఏర్పడిన వాతావరణ పరిస్థితులకు వాగులు, వంకలు, కుంటలు, చెరువులు పొంగి పార్లాల్సి ఉంది. చిన్నపాటి వర్షంతో సరిపెట్టడంతో ఆదివారం నుంచి ఎండల తీవ్రత పెరుగుతుందేమోనని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.


పెనుగాలులకు ఊగుతున్న చెట్లు

రంగనాయకస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు


స్వామి దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

రాచర్ల: నల్లమల అటవీ ప్రాంతం మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. ఆలయం సమీపంలోని నీటిగుండంలో స్నానాలు ఆచరించి, క్యూలో స్వామి దర్శనం చేసుకున్నారు. ఆలయ అర్చకులు అన్నవరం పాండు రంగచార్యులు, సత్యనారాయణచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూల అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు కృష్ణదేవరాయల కాపు బలిజ, గోపాలకృష్ణ యాదవ, కాశినాయన, యోగి వేమన రెడ్ల, ఆర్యవైశ్య అన్నదాన సత్రాల్లో అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి మల్లవరపు నాగయ్య పాల్గొన్నారు.

భవిష్యత్ తరాలకు నీరందించాల్సిన బాధ్యత మనదే


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి

మార్కాపురం టౌన్: భవిష్యత్ తరాలకు నీటిని సంరక్షించి అందించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం కళాశాలలో 'నీరు–మీరు' పేరుతో నీటి సంరక్షణపై విద్యార్థులకు ప్రిన్సిపాల్ అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరికి నీటి విలువ అర్థమయ్యేలా అవగాహన కల్పించాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో బాధ్యతను పెంచుతుందన్నారు. నీటి వనరులను రక్షించడం మనందరి కర్తవ్యమని తెలిపారు. వర్షం నీటిని ఒడిసిపట్టే కట్టడాలను శుభ్రం చేయడం, కొత్త ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలన్నారు. నీటి వాడకాన్ని గమనించేందుకు స్కోర్ కార్డులను తయారు చేయడం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ అనిల్ కుమార్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర

కంభం: స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమం తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారు. శనివారం కంభంలో 'బీట్ ది హీట్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో వీరభద్రాచారి మాట్లాడుతూ వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఉపాధి శ్రామికులు పనులు ఉదయం త్వరగా మొదలు పెట్టి పనులు పూర్తి చేసుకోవాలన్నారు. పని ప్రదేశంలో మంచినీరు, ఓఆర్ఎస్, మజ్జిగ అందుబాటులో ఏర్పాటు చేయాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. అవసరమైన చోట చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం అవగాహన ర్యాలీ, మానవహారం, ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. కంభం పంచాయతీ కార్యాలయంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీ కిరణ్, సర్పంచ్ పల్నాటి బోడయ్య, ఈఓపీఆర్డీ విజయలక్ష్మి, కార్యదర్శి రమేష్ రెడ్డి, రెవిన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమాలు సరే..ప్రజలు ఎక్కడ?

కొమరోలు: స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా 3వ శనివారం మండల కేంద్రమైన కొమరోలులో గ్రామ సచివాలయం-1లో అవగాహన కార్యక్రమాలను ప్రజలకు ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని ప్రజలను భాగస్వామ్యం చేస్తూ వారికి అవగాహన పరుస్తూ పరిశుభ్రతపై కార్యక్రమాలను చేపట్టాలి. కానీ కొమరోలులోని మండల స్థాయి అధికారులు, మండల ప్రత్యేక అధికారి వీటన్నింటిని విస్మరించి కేవలం అధికారులు కార్యక్రమాలలో పాల్గొంటూ మమ అనిపిస్తున్నారు. కొమరోలులోని గ్రామ సచివాలయంలో శనివారం మొదటిసారిగా మండల ప్రత్యేక అధికారి, సివిల్ సప్‌లై డిస్ట్రిక్ట్ మేనేజర్ వరలక్ష్మి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కొమరోలు గ్రామసచివాలయం-1లో వేసవి కాలం ముగిసే సమయంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా ఆకార్యక్రమాన్ని వరలక్ష్మీ ప్రారంభించారు. అదే కార్యాలయం ఆవరణలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు.

ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం

పొదిలి రూరల్: ప్రజల దాహర్తిని తీర్చేందుకే చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో ఈదర విజయలక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈఓఆర్డీ శోభన్‌బాబు, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, రవి చంద్రరెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంటేశ్వర్లు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో బొల్లి రమణారెడ్డి అన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని కె.ఎస్.పల్లె గ్రామంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓఆరడీ చెన్నారావు, ఏపీఎం రమణి, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.